ఎదురు చూపులు..!

- మహిళా సంఘాలకు వడ్డీ రాక పోవటంతో తీరని ఆర్థికభారం
- ఐదేళ్లుగా ఇబ్బందుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యుల
- కొత్త సర్కారుపై ఆశలు



రుణం ఉపాధికి వినియోగం..

సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఏటా బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు అందిస్తోంది. రుణాలకు చెల్లించిన వడ్డీని ప్రభుత్వం తిరిగి మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయాలి సుమారు రూ.7 లక్షల లోపు రుణం పొందితే 7 శాతం వడ్డీ చెల్లించాలి. అందులో 3 శాతం వడ్డీ జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్ క్రమం తప్పకుండా సంఘాల ఖాతాల్లో జమ చేస్తోంది. మిగిలిన వడ్డీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా... గడిచిన అయిదేళ్లుగా వడ్డీ జమ చేయడం లేదు. వీటి కోసం వేలాది మంది మహిళా సంఘాల సభ్యులు ఎదురుచూస్తున్నారు. దీంతో సంఘాల సభ్యులపై ఆర్థికభారం పడుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తామని పలు మార్లు ప్రకటించినా... కార్యరూపం దాల్చలేదు. దీంతో మహిళా సంఘాల సభ్యులకు ఎదురు చూపులే మిగిలాయి. ఈ చెల్లింపులపై కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంపైన మహిళా సంఘాలు కోటి ఆశలు పెట్టుకున్నారు.

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాలలో మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలకు స్వయం ఉపాధికి ఉపయోగించుకుంటారు. అనంతరం నెలవారీగా వడ్డీతో కలిసి చెల్లిస్తారు. నాలుగైదు నెలలకోసారి ప్రభుత్వం వడ్డీ డబ్బులు విడుదల చేస్తోంది. ఇలా వచ్చిన దబ్బులను బ్యాంకు మొత్తం రుణంలో తగ్గిస్తారు. దీంతో వడ్డీ భారం మహిళా సంఘాలపై పడదు. కానీ అయిదేళ్ల నుంచి వడ్డీ డబ్బులు జమ కావడం లేదు. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అందించినా... క్రమంగా కొన్ని పథకాలు తొలగించారు. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి నిమిత్తం బ్యాంకు రుణాలు మాత్రమే అందిస్తున్నారు.

కొత్త సర్కారు చెల్లిస్తే ....

బ్యాంకులలో తీసుకున్న రుణాన్ని ఎంత కష్టమైనా వడ్డీతో సహా మహిళా సంఘాల సభ్యులు చెల్లిస్తున్నారు. కొన్నేళ్లుగా వడ్డీ డబ్బులు రాకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. వడ్డీ డబ్బులను చెల్లిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉండగలదని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ బకాయిలను విడుదల చేయటం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మేలు జరగగలదంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

2.43 లక్షల మంది మహిళలు

- నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాల పరిధిలో 906 గ్రామ సంఘాలు ఉండగా, ఇందులో 22,580 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 2,43,244 మంది మహిళా సభ్యులు ఉన్నారు.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 118 గ్రామ సంఘాలు ఉండగా, ఇందులో 3,383 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 36,553 మంది మహిళా సభ్యులు కొనసాగుతున్నారు.
- రంగారెడ్డి జిల్లాలో 788 గ్రామ సంఘాలు ఉండగా, ఇందులో 19,192 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 2,06,691 మంది మహిళా సభ్యులు ఉన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించాలి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో రూ.2 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభ కాలేదని త్వరితగతిన పనులు ప్రారంభ మయ్యేలా చూడాలని జోనల్ కమీషనర్ పంకజాకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతి పత్రం అందజేశారు. అదే విధంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద నాలా వంతెనకు రూ.94 లక్షలు మంజూరైనా పనులను ఎండాకాలం పూర్తి అయ్యేలోగా పూర్తిచేయాల న్నారు.

కనుల పండువగా శ్రీ కరిగిరి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



ఉప్పల్: ఉప్పల్ శ్రీ కరిగిరి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన స్వామి వారి కల్యాణం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ప్రతి సంవత్సరం మాఘమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కందాడై శ్రీనివాసాచార్యులు, ప్రధాన అర్చకులు వేంకటాచారి, శ్రీనివాసచారి, రాఘవాచార్యులు తెలిపారు.

ఉప్పల్‌లో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా



సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్‌మున్షీ

కుషాయిగూడ: ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నేత సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీ దీపాదాస్‌మున్షీ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన త్రివేణి పాఠశాల విద్యార్థిని



విద్యార్థిని పూజారెడ్డిని అభినందిస్తున్న త్రివేణి పాఠశాల యాజమాన్యం

అల్వాల్: నేషనల్ ఇన్నొవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డులో అల్వాల్ త్రివేణి పాఠశాల విద్యార్థిని పూజారెడ్డి ప్రథమ బహుమతి గెలుచుకొని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థిని పూజారెడ్డి సొల్యూషన్స్ టు మాన్‌హోల్ యాక్సిడెంట్స్ ప్రాజెక్టు తయారుచేసింది. ఈ సందర్భంగా శుక్రవారం త్రివేణి స్కూల్‌లో విద్యార్థిని పూజారెడ్డికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ సీఆర్‌వో వెంకట్రావు, ప్రిన్సిపల్ శ్రీసుధ, టీచర్ సురేఖ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ ఈస్ట్ ఇందిరానెహ్రూనగర్‌లో నివసించే వినోద్‌కుమార్‌కు కాలు ఇన్ఫెక్షన్ అయి రెండు వేళ్లు తీసివేశారని, అతని ఆర్థిక పరిస్థితి బాగాలేక వైద్య ఖర్చులకు తాళలేక ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మానవసేవే మాధవసేవ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు గ్రూప్ సభ్యుల సహకారంతో వినోద్‌కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు, మహ్మద్ రషీద్, ఉదారి సత్యనారాయణయాదవ్, చిన్న స్వామి తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



ఉప్పల్ పారిశ్రామిక వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక నేతలు

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్ శుక్రవారం ఉప్పల్ పారిశ్రామిక వాడలో విజయవంతం అయింది. సిఐటియు, ఏఐటియుసి, బిఆర్‌టిటియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉప్పల్ పారిశ్రామిక వాడ నుంచి వివిద ప్రాంతాల్లో నాయకులు ర్యాలీ నిర్వహించి దారి పొడవునా నినాదాలు చేసారు. కార్యక్రమంలో సిఐటియు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె. వెంకన్న, ఎండి గౌస్, యాదగిరి, మారుతి రావు, సంపత్, శ్రీనివాస్, ఎం. వినోద, ఉర్మిళ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మితిమీతున్న యాజమాన్యం ఆగడాలు

మేడిపల్లి: మేడిపల్లిలోని లాంగ్ డ్రైవ్ కార్ల కంపెనీ ఉద్యోగులపై యాజమాన్యం ఆగడాలు మితి మీరుతున్నాయి.తమ సంస్థలో పనిచేసేవారిపై దాడులకు తెగబడుతున్నట్లు తెలిసింది. తమ మాట వినని ఉద్యోగులను చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఉపాధి కోసం సంస్థను ఆశ్రయించిన చిరుద్యోగుల అవసరాలను, బలహీనతలను గుర్తించి వారి జీవితాలతో యాజమాన్యం ఆటలాడుకుంటోందని తెలిసింది. ఈ విషయాలపై సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు. పోలీసులు కూడా దాడికి పాల్పడ్డ వారికోసం గాలిస్తున్నట్లు తెలిసింది.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

మల్లాపూర్: కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మల్లాపూర్ ఎస్ఎల్ఎన్ఎస్ పంక్షన్ హాల్‌లో ఉప్పల్ అసెంబ్లీ ప్రవాస్ యోజనలో భాగంగా ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మురళీధర్‌రావు హాజరై మాట్లాడారు. మోదీ నాయకత్వంలో గత 10 సంవత్సరాలుగా దేశంలో రైలు, రోడ్డు విమానయాన, పోర్టులను విస్తరింపజేస్తూ అనేక మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. అనేక సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు అందజేస్తూ, అవినీతి రహిత పాలనను అందజేస్తూ దేశ ఆర్థిక ప్రగతిని సాధించిన విషయాలను బూత్ స్థాయి వరకు తీసుకువెళ్లి పార్టీ పటిష్టపర్చాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పార్లమెంట్ క్లస్టర్లలో చేపట్టబోయే విజయ సంకల్ప యాత్ర (బస్సు యాత్ర) ఉప్పల్ నియోజకవర్గంలో ఉప్పల్-రామంతాపూర్,హబ్సిగూడ,నాచారం,హెచ్‌బీకాలనీ గుండా సాగుతుందన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఉప్పల్: రామంతాపూర్ చెరువు కట్ట వద్ద ఉన్న సిమ్ లయన్ జిమ్, జయసింహా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి మద్యాహ్నం వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ట్రస్టీ జయసింహా తెలిపారు. తమవంతుగా సమాజా సేవ చేయడానికి రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని ఆసక్తి గల యువకులు వచ్చి శిబిరంలో పాల్గొనాలన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన శాలివాహన సంఘం ప్రతినిధులు



కుషాయిగూడ: చర్లపల్లికి చెందిన కుమ్మరి సంఘం (శాలివాహన) ప్రతినిధులు శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు కుండల తయారీకి అందుబాటులో ఉన్న అధునాతన ఆటోమెటిక్ పాట్ మేకింగ్, హీటర్ యంత్రాలను సమకుర్చాలని కోరుతూ వినతిపత్రము అందజేశారు. మంత్రి సానుకూలంగ స్పందించినట్లు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. జౌండ్ల ప్రభాకర్‌రెడ్డి, బొడిగె రాజుతో పాటుగా శాలివాహన సంఘం ప్రతినిధులు బాలరాజు, రవి, రాము, నరేష్, రాజు, సురేష్ ఉన్నారు.

పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి



ఉప్పల్ జలమండలి కార్యాలయంలో అధికారులతో కలిసి కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

ఉప్పల్: పెండింగ్‌లో ఉన్న సివరేజ్, మంచి నీటి పైపులైన్ పనులు వెంటనే పూర్తి చేయాలని, వేసవిలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ జలమండలి జీఎం సంతోష్, డిజిఎం రజిని కాంత్ రెడ్డి, మేనేజర్ సత్యనారాయణతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ పనులను అధికారులకు వివరించారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, కొండల్ రెడ్డి, బింగ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బొల్లిగూడెం మహాలక్ష్మినగర్‌కు చెందిన ఎం. వాణి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమెకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ రూ 2.50లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు రాసాల వెంకటేశ్ యాదవ్, తోటకూర అజయ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ నేతలు దానగల్ల యాదగిరి, పడతం లోకేశ్, మాడుగుల శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శృంగేరి మఠంలో రథసప్తమి పూజలు



అల్వాల్: సైనిక్‌పురిలో శృంగేరి మఠం శ్రీవిజయ గణపతి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి పూజలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శృంగేరి జగద్గురు శ్రీభారతి తీర్థ మహాసన్నిదానం, జగద్గురు శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి అనుగ్రహ ఆశీస్సులతో లోకకళ్యాణం కోసం అరుణ పారాయణ, విశేష సౌర అర్చనలు, సూర్య సమస్కార పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠం ధర్మాధికారి పండరినాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. ఒకరు మృతి



శంకర్ (ఫైల్)

భువనగిరి క్రైమ్: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఉప్పల్‌లోని చిలకానగర్‌కు చెందిన కడియాల శంకర్(48) టైల్స్ వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం భువనగిరిలో పనులు ముగించుకుని హబ్సిగూడకు చెందిన చంద్రశేఖర్‌తో కలిసి బైక్‌పై ఉప్పల్‌కు వెళ్తున్నాడు. అయితే చెరువు కట్ట వద్ద లారీ మలుపు తిరుగుతూ ఒక్కసారిగా బైక్ పైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందగా, చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా వెంకట్‌రెడ్డి



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా కుషాయిగూడకు చెందిన సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ పార్టీ సమావేశంలో ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సీ సర్టిఫికెట్ పరీక్షలు



ఘట్‌కేసర్: అనురాగ్ విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎన్‌సీసీ క్యాడెట్లు ''సీ'' సర్టిఫికేట్ పరీక్షలకు శుక్రవారం హాజరయ్యారు. సికింద్రాబాద్‌లోని బైసన్ గ్రౌండ్‌లో ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ ప్రాక్టికల్ ఎగ్జామ్‌ను ఈసీఓ గ్రూపు కెప్టెన్ వర్ష గోఖలే, వింగ్ కమాండర్ డీఎస్ఎన్ మూర్తి, కో కాకినాడ ఎయిర్ ఎన్‌సీసీ యూనిట్‌తో కలిసి పరీక్ష నిర్వహించారు.

చౌదరిగూడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: చౌదరిగూడ సాయిరాం నగర్ కాలనీలో రూ. 5 లక్షల జెడ్పీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చౌదరిగూడ గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్, వార్డు సభ్యుడు భోజిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్: ఉప్పల్‌లో దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న స్థానిక సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం తన గళాన్ని వినిపించాడు. నియోజకవర్గ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ వల్ల పనులు ఆలస్యంగా కొనసాగుతుండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత మంత్రి చొరవ తీసుకుని ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయి దోమల బెడద తీవ్ర తరమైందని, నియోజవర్గ పరిధిలోని చెరువుల సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. దీంతోపాటు పెండింగ్‌లో ఉన్న సివరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌ను ప్రారంభించాలని, ఉప్పల్‌లో 100 పడకల అసుపత్రి గత ప్రభుత్వం మంజూరు చేసిందని దాని పనులను కూడా ప్రారంభించాలని కోరారు. బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు విడుదల చేయాలని కోరారు. అందుకు స్పందించిన మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో సమావేశ మయ్యామని దాన్ని కూడా త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

మల్కాజిగిరిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



మల్కాజిగిరి: దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల ఐక్య వేదిక బంద్ పిలుపులో భాగంగా మల్కాజిగిరి చౌరస్తాలో సిఐటీయూ మల్కాజిగిరి కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నాయకుడు కోమటి రవి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాద ఎజెండాతో పాలన కొనసాగిస్తున్నదే తప్ప పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. సామరస్యంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన పంజాబ్, హర్యానా రైతుల పై కేంద్ర ప్రభుత్వం దాష్టికమైన చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కారన్నారు.రాబోయే ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పకపోతే భారతదేశంలో ప్రమాదకర పరిస్థితులు ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కృపాసాగర్, నర్సింగరావు,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి పారిశ్రామికవాడలో సమ్మె విజయవంతం



చర్లపల్లి పారిశ్రామికవాడలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తు కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె చర్లపల్లి పారిశ్రామికవాడలో విజయవంతం అయింది. సిబటీయు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ బంద్‌లో కార్మికులు విధులు బహిష్కరించి పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా పారిశ్రామికవాడలో కార్మికులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం సిఐటీయూ జిల్లా ప్రదాన కార్యదర్శి జె. చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మిక, రైతు చట్టాలను కాలరాస్తు మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తుందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు సత్యనారాయణ, జి. శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నరసింహ, బాలరాజు, శ్రీనివాసు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

బేబీ కిట్స్ పంపిణీ



బేబీ కిట్స్ అందజేస్తున్న మల్క కొమరయ్య

మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మెటర్నిటీ వార్డులో ఉన్న బాలింతలకు బేబీ కిట్స్‌ను పల్లవి ఫౌండేషన్ ఛైర్మన్ బీజేపీ నాయకుడు మల్క కొమరయ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్నారుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక టీకాలను అందుబాటుల ఉంచిందని వాటిని సకాలంలో అందజేయాలన్నారు. ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ గొప్ప పథకమని అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సంగీత్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి సీసీ కెమెరాల అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు సీసీ కెమెరాలను అందజేస్తున్న దృశ్యం

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నాగక్ష్మీనగర్ కాలనీలోని నందీశ్వ రాలయానికి బాబానగర్‌కాలనీ చెందిన ముచ్చటి సాయిలోకేష్ రూ.51 వేల విలువ చేసే 8 సీసీ కెమెరాలను ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గడ్డమీది శ్రీహరి గౌడ్, పీఆర్,నాగరాజు, తోట నవీన్‌గౌడ్, కోయ్యలకొండ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వరం పరిష్కారం చూపుతాం



కాలనీ సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: డివిజన్‌ల్లో పెండింగ్ ఉన్న సమస్యలకు సత్వరం పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్‌లోని 10, 22 డివిజన్‌ల్లో శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణ, మహేశ్వరితో కలిసి పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డివిజన్‌ల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు సమస్యలున్నాయని వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. మంచి నీటి సమస్యలున్నాయని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకురాగా జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామన్నారు. ఈకార్యక్రమంలో డిఈ శారద, బీఆర్ఎస్ నేతలు బొమ్మక్ బాలయ్య, కృపాసాగర్ ముది రాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ ఎదుట కార్మికుల ధర్నా



ఈసీఐఎల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు..

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా శుక్రవారం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఈసీఐఎల్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు జోషి, విజయ్, రాజశేఖర్, బాలకృష్ణ, గణేష్, అంజనీకుమార్, రమేష్‌బాబు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.